‘పల్లె’వెలుగెక్కడ?

- మారుమూల గ్రామాలకు లేని బస్సు సర్వీసులు
- రహదారి సౌకర్యం ఉన్నా పట్టించుకోని ఆర్టీసీ

బస్సు సౌకర్యం లేని నాగల్‌కొండ–ఇలాయిస్‌నగర్‌కు వెళ్లే రహదారి

నార్నూర్, డిసెంబర్ 26 : అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది మారుమూల గ్రామాల పరిస్థితి. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మారుమూల గ్రామాల ప్రజలకు పల్లెవెలుగు బస్సు సేవలు అందడం లేదు. మండలాల పరిధిలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలలు, పాఠశాలలకు సమయానికి రాలేక, ఆర్థికంగా నష్టపోతూ విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు ఆటోలలో వ్యయ, ప్రయాసల కోర్చి ప్రయాణం చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. బస్సులు నడపాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజన ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలోని మలంగి, నాగల్‌కొండ, సోనాపూర్, ఎంపల్లి, సుంగపూర్, ఖండోరాంపూర్, ఆదిమ్యాన్, మేడిగూడ, పర్సువాడ, లోకారి(బీ) గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై బస్సులు నడపడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఈ రహదారిపై బస్సులు నడిపితే మండల కేంద్రాలకు గిరిజన ప్రజలకు ప్రయాణం సులువు అవుతోంది. కాని బస్సు లేదు.

విద్యార్థులు, మహిళలు అవస్థలు...

పలు గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు, మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థులు ఆటోలలో ప్రయాణిస్తూ ఆర్థికంగా నష్టపోతూ సకాలంలో పాఠశాలలకు, కళాశాలలకు చేరలేక చదువులోను వెనుకబడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు అందకుండా పోతోంది.

బస్సులు నడపాలి..

తాడిహత్నూర్ నుంచి ఇయిలాస్‌నగర్ వరకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలి.
-జాదవ్ సునీత, సర్పంచ్, నాగల్‌కొండ గ్రామం

బస్సులు నడిపితే ప్రయాణం సులువు..

మండల కేంద్రం నుంచి మాంజ్రి వెళ్లాలంటే ఆటోలలో ప్రయాణిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. బస్సులు నడిపితే గిరిజనులకు ఆర్థిక భారం తగ్గుతుంది.
-ఆత్రం మహేశ్వరి, సర్పంచ్, రాంపూర్ గ్రామం

మారుమూల గ్రామాలకు బస్సులను నడిపించాలి

మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్

జైనథ్, డిసెంబర్ 26 : మండలంలోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జైనథ్ మండలంలోని లక్ష్మిపూర్ గ్రామానికి బస్సును వేయడం హర్షించదగ్గ విషయమైన, ఇందులో ఆర్టీసీ అధికారులు, నాయకులు ప్రోటోకాల్‌ను విస్మరించారని విమర్శించారు. కాగా మండలంలోని బెల్లూరిగూడ, మాకోడ, గూడ, రాంపూర్, సిర్సన్న, గిమ్మ, ఆకోలి, కోరట, సుందరగిరి గ్రామాలకు వెంటనే ఆర్టీసీ బస్సును నడిపించడంతో పాటు మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బాలపూర్ సర్పంచ్ వినోద్ యాదవ్, ఎంపీటీసీ భోజన్న, గోవిందరావ్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

భీంపూర్, డిసెంబర్ 26 : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం కరంజి(టీ) గ్రామానికి చెందిన రైతు మర్ల మహేందర్ కొన్నేళ్లుగా అప్పుల బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంటి సమీపకొట్టంలోని దూలానికి ఉరివేసుకున్నాడు. చేనులోకి వెళ్లడానికి తయారవుతున్న భార్య అనిత, తల్లి శాంతాబాయిలు ఇది చూసి సర్పంచ్‌కు విన్నవించారు. ఎస్ఐ లాల్ సింగ్‌నాయక్, సిబ్బంది పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం తర్వాత కుటుంబీకులకు అప్పగించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పార్టీకి కాదు పదవికి రాజీనామా చేయాలి

మాట్లాడుతున్న ఎంపీపీ గండ్రత్ రమేశ్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26 : ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడంపై ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీపీ గండ్రత్ రమేశ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ ఓడిందని పార్టీని వీడిన భోజారెడ్డి దమ్ముంటే ముందుగా తనకు పార్టీ ఇచ్చిన డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అబ్దుల్ కుద్దుస్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26 : పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అబ్దుల్ కుద్దుస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వరకట్నం నిషేధానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ రిజ్వాన్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నదీమొద్దీన్, ప్రధాన కార్యదర్శి కిజర్ యాఫై, ఉపాధ్యక్షుడు ఆరీఫ్ ఖాన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

28న కంటి వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు), సింగరేణి ఉద్యోగుల, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్రచికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు కలిగిన వారికి చికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్న 2.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

పూలాజీబాబా ధ్యాన మందిర వార్షికోత్సవం


పూలాజీబాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 26 : మండలంలోని అంజి గ్రామంలో పూలాజీబాబా ధ్యాన మందిర 34వ వార్షికోత్సవ వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పూలాజీబాబా చిత్రపటంతో పాటు ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వేడుకల్లో ధ్యానం చేశారు. ఉత్సవ కమిటీతో పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గారుశే కుసుంబాయి, పూలాజీబాబా ధ్యాన మందిరం అధ్యక్షుడు దశరథ్ పటేల్ గారులే, పూలాజీబాబా కుమారుడు కేశవ్‌ఇంగ్లే, ఆంద్ ఆదివాసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాస్, ఆంద్ ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు డాకురే రాందాస్, ఆంద్ ఆదివాసీ పెద్దలు పుండలిక్, నాయకులు సోమాసే వెంకట్‌రావ్, నాగోరావ్ సోమోరే, ముకాడే ఉత్తమ్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఉదారి సాహితీ సేవ ఆదర్శం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26 : ఆదిలాబాద్ జిల్లాలో సాహితీ సంపద సుసంపన్నం చేస్తున్న డాక్టర్ ఉదారి నారాయణ ఆదర్శమని ఆకాశవాణి విశ్రాంత సంచాలకుడు, ప్రముఖ రచయిత సుమన స్పతిరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఉదారి నారాయణ రాసిన మళ్లీ మనిషిలోకి పుస్తక పరిచయ సభకు ఆయన హాజరై మాట్లాడారు. బతుకు భయం, భద్రత నుంచే అనేక ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. ప్రధాన వక్త గోపగాని రవీందర్ మాట్లాడుతూ 44 కవితలు ఉన్న ఉదారి మళ్లీ మనిషిలోకి సంపుటిలో ప్రతి కవితాక్షరం అక్షర సత్యమన్నారు. ఉదారి తండ్రి తత్వకవి నాగదాసుల బాటలోనే కుటుంబ సాహితీ సేవ చేయడం ఆదర్శమని రవీందర్ అభినందించారు. సభలో ఐత్యారం ముచ్చట్లు కార్యక లాపాలు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు ,రచయితలు వసంత్‌రావు దేశ్‌పాండే, సామల రాజవర్ధన్, రిజ్వాన్, బొల్లారం బాబన్న, చరణ్‌దాస్, వీరన్న, తొడసం చందు, శైలజ, త్రివేణి, అరుణ, లక్ష్మీనారాయణ, భూమన్న, గంగన్న పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఘాతుకం

- కత్తులు, గొడ్డళ్లతో వెంబడించి దారుణ హత్య
- వ్యవసాయ భూమి కోసం ఆరు నెలలుగా గొడవ
- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో కలకలం

వానోలే ఈశ్వర్(ఫైల్)

ఇచ్చోడ, డిసెంబర్ 26 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం వానోలే ఈశ్వర్(32)ను ఇద్దరు వ్యక్తులు గొడ్డలి, కత్తులతో వెంబడించి మరీ దారుణ హత్య చేసిన ఘటన కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన లక్ష్మిబాయికి కేదోబా, పాండ్‌రంగ్ కుమారులు. ఈమె భర్త రామ్‌జీ పదేండ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో పెద్ద కుమారుడు కేదోబా(రిటైర్డ్ టీచర్) నివాసం ఉంటున్నాడు. చిన్న కుమారుడు పాండ్ రంగ్ కూడా ఇచ్చోడ మండలంలోని ఏడో నంబర్‌లో ఉంటున్నాడు. వీరి తల్లి పేరిట జాతీయ రహదారిని అనుకొని ఏడో నంబర్‌లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరు కుమారులకు చెరో ఎకరం చొప్పున పంచి ఇచ్చింది. మిగతా ఎకరం తన పేరిట ఉంచుకున్నది. లక్ష్మీబాయి పెద్ద కుమారుడి వద్దనే ఉంటున్నది. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం కేదోబా కుమారుడు వానోలే ఈశ్వర్ పేరిట ఎకరం భూమి కూడా పట్టా చేసింది. అప్పటి నుంచి ఈశ్వర్‌కు పాండ్ రంగ్, ఆయన కుమారుడు సూర్యకాంత్‌తో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పెద్దల వద్ద పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో ఈశ్వర్‌పై పాండ్ రంగ్, అతని కుమారుడు సూర్యకాంత్ పగ పెంచుకున్నారు. పథకం ప్రకారం వానోలే ఈశ్వర్‌ను మంగళవారం ఉదయం పాండురంగ్, సూర్యకాంత్ కలిసి సిరిచెల్మ చౌరస్తాలో వెంబడించి కత్తులు, గొడ్డలితో నరికి చంపారు. సమాచారం తెలుసుకున్న ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని ఈశ్వర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పాండ్ రంగ్, సూర్యకాంత్ పారిపోగా.. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈశ్వర్ భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా.. ఈశ్వర్‌కు నాలుగేండ్ల కూతురు ఉంది.

ఆదిలాబాద్‌రూరల్ : పూజలు చేస్తున్న భక్తులు


బోథ్: కన్గుట్టలో దత్తాత్రేయ ఉత్సమూర్తిని ఊయలలో ఉంచి పాటలుపాడుతున్న భక్తులు

ఘనంగా దత్త జయంతి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26 : ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం భక్తులు దత్త జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్త మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కీర్తనలతో దత్తాత్రేయ ఉత్సవమూర్తితో పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో గల దత్త మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.


తాంసి: గిరిగామలో నిర్వహించిన దత్త జయంతిలో పాల్గొన్న మాజీ ఎంపీ నగేశ్

దత్త జయంతి వేడుకల్లో మాజీఎంపీ

తాంసి, డిసెంబర్ 26 : గిరిగామ గ్రామంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ నగేశ్, జడ్పీటీసీ తాటిపల్లి రాజు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురకుంటి మంజుల–శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ గజానంద్, బీఆర్ఎస్ నాయకుడు అరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, డిసెంబర్ 26 : మండల కేంద్రంలో దత్త జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని వివిధ విధుల్లో దత్తసాయి ప్రతిమలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు ఆధ్మాత్మిక పాటలపై ఆడిపాడారు. అనంతరం దత్తసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బజార్‌హత్నూర్, డిసెంబర్ 26 : మండల కేంద్రంలోని సాయిబాబా, శబరిమాత, దత్తాత్రేయ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గ్రామంలోని ప్రధాన వీధులగుండా దత్తాత్రేయ ఉత్సవ మూర్తితో పల్లకీ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వక్తలు ప్రవచనాలు వినిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం కోనసాగింది.

బోథ్, డిసెంబర్ 26 : కౌఠ(బీ), ధన్నూర్(బీ), కన్గుట్ట, కుచులాపూర్, బోథ్ శబరిమాత ఆశ్రమాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ ఉత్సమూర్తిని ఊయలలో ఉంచి పాటలు పాడారు. భక్తులు అన్నదాన కార్యక్రమంలో సహాపంక్తి భోజనాలు చేశారు.

జైనథ్, డిసెంబర్ 26: మండలంలోని ముక్తాపూర్, నిరాల, బాలపూర్ గ్రామాల్లో దత్తాత్రేయ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు దత్తాత్రేయ విగ్రహాన్ని బంతి పూలతో అలంకరించిన పల్లకీలో ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, బాలపూర్ సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్, గిమ్మ ఎంపీటీసీ భోజన్న, భక్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: దత్తసాయి ప్రతిమతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బజార్‌హత్నూర్: పల్లకీ శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు

పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి : మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, డిసెంబర్ 26: సద్గురు పరమహంస శ్రీ పూలాజీబాబా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని అంజి గ్రామంలో పూలాజీబాబా ధ్యాన కేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ముందుగా ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలతో కలిసి బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 26: ఆధ్యాత్మికతతోనే మనిషి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం సిరికొండ మండలం రాజంపేట్ గ్రామంలో నిర్వహించిన అఖండ హరినామం శివలీల అమృత పారాయణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రిమ్మ, కన్నపూర్ సర్పంచ్‌లు అనిల్ కుమార్, రఘురాం, ఎంపీపీ అమృత్‌రావ్, నాయకులు ఇమామ్, బిక్కు, పాండు, బషీర్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన జిల్లా అధ్యక్షుడు

ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్లు

ఎదులాపురం, డిసెంబర్ 26 : ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ మంగళవారం హైదరాబాద్‌లోని దారుసలాంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు విషయాలు, పార్టీ చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. కలిసిన వారిలో ఎంఐఎం పార్టీ కౌన్సిలర్లు షానవాజ్, జాఫర్ అహ్మద్, పట్టణ జాయింట్ సెక్రటరీ మహ్మద్ రోహిత్ ఉన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 26 : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ముగ్గురికి న్యాయస్థానం జైలు శిక్షను విధించిందని ట్రాఫిక్ ఎస్ఐ రావుల దేవేందర్ తెలిపారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎండీ అజీజ్ ఉర్ రహమాన్ ఒకరికి ఒక రోజు, ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించారు.

ఒకరి మృతి

ఖైంసాటౌన్, డిసెంబర్ 26: వానల్‌పాడ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చక్రధర్ నిజామాబాద్ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతడికి బైకు అదుపు తప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

జైనథ్, డిసెంబర్ 26: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బోథ్, డిసెంబర్ 26: మండల కేంద్రంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు బీ గోవర్ధన్, షేక్ షాకీర్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణాధ్యక్షుడు నరేశ్, రాథోడ్ ప్రేమ్‌సింగ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తాంసి, డిసెంబర్ 26: మండలంలోని గోట్కూరి గ్రామంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత చంద్రమౌళి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా సీనియర్ నాయకురాలు సునీత, జిల్లా సీనియర్ నాయకులు రహీం, రాంరెడ్డి, కిష్టన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 26 : శ్రీరామ జన్మభూమిలో భవ్య రామ మందిర నిర్మాణం నెరవేరుతోందని మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని శ్రీ గోపాలకృష్ణ మఠం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలాల వారీగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. జనవరి 22వ తేదీన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని ప్రతి ఇంటికి అంక్షితల పంపిణీ చేపడుతున్నారన్నారు.

తాంసి మండలానికి చేరిన తలంబ్రాలు

తాంసి, డిసెంబర్ 26 : అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రాముల తలంబ్రాలు మంగళవారం తాంసికి చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో పీఠాధిపతి యోగానంద సరస్వతి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు, నారాయణ, రాజుల్వార్ దత్తాత్రేయ చేతుల మీదుగా తాంసి మండలానికి చెందిన తలంబ్రాలను సర్పంచ్ సర్పంచ్ స్వప్న–రత్న ప్రకాశ్ అందజేయగా మండల కేంద్రానికి తీసుకువచ్చి స్థానిక రామ మందిరంలో ఉంచారు. కార్యక్రమంలో హిందూ యువసేన సభ్యులు కార్తీక్, సాయిరాం, గుగ్లిళ్ల రవితేజ, రాజు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే వరకు ఉద్యమం

ఇంద్రవెల్లి, డిసెంబర్ 26: చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. ముందుగా పలు విషయాలతో పాటు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయా మండలాలకు చెందిన తుడుందెబ్బ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వెంటనే పరిష్కరించాలన్నారు. జీవో నంబర్ 3కు చట్టం చేసి 29 శాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సమాచార హక్కు చట్టంను సరైన రీతిలో సద్వినియోగం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ జలపతి, ఉయిక సుదర్శన్, తిరుపతి, కొడప నగేశ్, నైతం రమేశ్, వెట్టి మనోజ్, ముకుంద్, ఆత్రం బాపురావ్, జుగ్నాక్ భరత్ పాల్గొన్నారు.